


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 25-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :68 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## కృష్ణా జలాలపై తేలని పంచాయితీ..


2 లో

- సాగర్, శ్రీశైలం నీటి వినియోగంపై వాడీవేడీ చర్చ
- ఏపీకి 47 టీఎంసీలు ఇవ్వాలన్న డిమాండ్
- తెలంగాణ అభ్యంతరం.. పోతిరెడ్డిపాడుపై వివాదం
- ఇప్పటికే 10 టీఎంసీలు వాడుకున్నారన్న తెలంగాణ
- పోతిరెడ్డిపాడు నుంచి 22 టీఎంసీలకు ఓకే: ఏపీ
- తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలు కోరిన ఏపీ
- నిర్ణయం లేకుండానే ముగిసిన కేఆర్ఎంబీ భేటీ
- సెప్టెంబర్ 4న మరోసారి సమావేశం

## విజయ్ 'సూపర్ సిక్స్'!

- అసెంబ్లీలో విజయ్ సంక్షేమ బాణం
- మహిళలకు ఫ్రీ బస్ జర్నీ.. మరింత విస్తరణ
- ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు
- 1.30 కోట్ల కుటుంబాలకు 'సూపర్ సిక్స్'
- ఉచిత ప్రయాణానికి ఆదాయ పరిమితి లేదు
- సంక్షేమ పథకాలపై రూ.10 వేల కోట్ల భారం
- రైతుల కోసం పరందూర్ ఎయిర్‌పోర్ట్ రద్దు
- చెన్నై ఎయిర్‌పోర్టుకు కొత్త టెర్మినల్
- గాంధీ జయంతి నుంచి ఫ్రీ బస్ ప్రయాణం


2 లో

**న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం):** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అసెంబ్లీ వేదికగా కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ విస్తరణతో పాటు పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే రైతుల వ్యతిరేకత నేపథ్యంలో పరందూర్ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

'వెట్రి పయనం' – విస్తృత ఉచిత బస్సు ప్రయాణం

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని 'వెట్రి పయనం' పేరుతో విస్తరించారు. అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుంది. మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లోని ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించవచ్చు.

## బీజేపీలోకి సురేఖ? నిర్ణయం పార్టీదే!

- సురేఖ వస్తానంటే పరిశీలిస్తామన్న డీకే అరుణ
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ టికెట్‌పై కీలక డిమాండ్
- పవన్ కుమార్ రెడ్డి కోసం టికెట్ అడిగాం
- బాధ్యత మారితే మరింత మంచి పదవి
- తెలంగాణ బీజేపీ ఎంపీలంతా కలిసే ఉన్నారు
- కాంగ్రెస్‌లో ఆగస్టు సంక్షోభం తప్పదన్న అరుణ
- రేవంత్‌కు అన్నీ తెలుసంటూ డీకే అరుణ వ్యాఖ్య

2 లో

## ఫీజు బకాయిలపై బీజేపీ సమరం

- 5 లక్షల మంది విద్యార్థుల సంతకాలు
- రూ.12 వేల కోట్ల బకాయిలు.. బాధ్యత కాంగ్రెస్‌దే
- విద్యార్థుల ఆందోళనలపై పోలీసుల దురుసు వైఖరి
- ఉస్మానియాకు రూ.1,000 కోట్ల హామీ ఏమైంది?
- కాలేజీలకు నిధుల్లేక అధ్యాపకులకు జీతాల కష్టాలు
- విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు నిలిపివేత
- పాలిటెక్నిక్, ఆయుష్ విద్యార్థుల సమస్యలపై ఆగ్రహం
- రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి సమాధానం చెప్పాలి
- ఫీజు బకాయిలపై పోరాటం ఆగదు: బీజేపీ


2 లో

## సర్కార్ నిర్ణయానికి హైకోర్టు సమ్మతి

- తెలంగాణ సర్కార్‌కు హైకోర్టులో ఊరట
- 25 శాతం అదనపు సాయానికి గ్రీన్‌సిగ్నల్
- దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారమే సాయం
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు ఊరట
- పథకాలపై పిటిషన్ల విచారణ వాయిదా
- రెండు వారాలకు తదుపరి విచారణ

2 లో

## ఆ రోజే కొత్త పార్టీ ప్రకటన!

- ఏపీ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు
- పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు
- ప్రజల కోసం ప్రత్యేక రాజకీయ వేదిక
- వైసీపీకి ప్రత్యామ్నాయంగా కొత్త పార్టీ?
- విజయసాయి అడుగులతో ఏపీ పాలిటిక్స్ హీట్
- ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
- విజయసాయి ప్రకటనతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి

2 లో

## హోంమంత్రి అనితకు స్వల్ప గాయం


2 లో

**న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం):** తిరుపతి వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభమైన 'అమరావతి ఛాంపియన్ షిప్' క్రీడా పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేతిపై ఓ డ్రోన్ బ్యాటరీ పడటంతో ఆమెకు గాయమైనట్లు తెలిసింది.

## 22ఏపై సర్కార్ క్లారిటీ




**న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం):** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. 22ఏ భూములకు సంబంధించి నిజమైన సమస్యలు ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి.. 22ఏ భూముల అంశంపై పలు కీలక విషయాలను వెల్లడించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములు, వివిధ ప్రభుత్వ ఉత్తర్వులు, రిలాక్సేషన్ ఇచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రిలాక్సేషన్ వచ్చిన కేసులను క్లియర్ చేశామని.. రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిలో నిజమైన సమస్యలను పరిశీలించి 24 గంటల్లో పరిష్కారం చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఒకట్రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నా వాటినీ పరిశీలించి పరిష్కరిస్తామని.. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

మిగతాది 2 లో..

- భయపడొద్దు.. న్యాయం చేస్తాం
- 24 గంటల్లో సమస్యల పరిష్కారం
- 1,162 కాల్స్.. 980 ఫిర్యాదులు
- 547 వ్యవసాయ..433 ఇతర సమస్యలు
- 22ఏపై ప్రతిపక్షాల తప్పుడు ప్రచారం
- నకిలీ పత్రాలతో వస్తే కేసులే
- 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి
- ప్రతి సోమవారం అధికారులతో సమీక్ష
- అర్హులకు ఫాస్ట్‌ట్రాక్ రిజిస్ట్రేషన్లు

## తెలంగాణపై కేంద్రం వివక్ష : సీఎం రేవంత్



2 లో

- అమెరికా టూర్‌కు నో ఎందుకు?
- రేవంత్‌కు కేంద్రం షాక్!
- తెలంగాణపై కేంద్రం వివక్ష!
- కేంద్రంపై రేవంత్ ఫైర్!
- గుజరాత్‌కు ఓకే.. తెలంగాణకు నో!
- టూర్‌పై రేవంత్ సంచలన ఆరోపణలు
- అమెరికా టూర్ అడ్డుకున్నారా?
- కేంద్రంపై సీఎం తీవ్ర ఆగ్రహం
- తెలంగాణను అడ్డుకుంటున్నారా?

## ఉద్యోగాలు నిల్.. లిక్కర్ ఫుల్!

- 121 మద్యం బ్రాండ్లపై హరీశ్ ఫైర్
- యువతకు నోటిఫికేషన్లు ఎక్కడ?
- ఉద్యోగాల కంటే మద్యంపైనే శ్రద్ధా?
- యువత భవిష్యత్తుతో చెలగాటమా?
- 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- 'రేవంత్ పగ.. యువత దగా'
- ఇదేనా మీరు చెప్పిన ప్రజా పాలన?
- లిక్కర్ నోటిఫికేషన్లపై రాజకీయ వేడి


2 లో

## స్మార్ట్ మీటర్లపై కవిత ఫైర్!

- ప్రజల బ్రెయిన్‌వాష్ చేస్తున్నారంటూ ఫైర్
- పేదల సబ్సిడీ ఎత్తేసే కుట్ర: కవిత
- అదానీలకు కొమ్ముకాస్తున్నారంటూ ఆరోపణ
- స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం
- ప్రజలపై భారం మోపేందుకే కొత్త విధానమా?
- కేంద్రం ముందు ప్రభుత్వం మోకరిల్లిందా?


2 లో

**న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం):** రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లకు దశలవారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

# బీజేపీలో సురేఖ?.. నిర్ణయం పార్టీదే!



న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ భవిష్యత్ కార్యాచరణ ఏంటనే చర్చ జోరుగా జరుగుతోంది. తనను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేస్తే ఆమె కాంగ్రెస్ కు రాజీనామా చేసి మరో పార్టీలో చేరబోతున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్న వేళ కొండా సురేఖ బీజేపీలో చేరికపై ఎంపీ డీకే అరుణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ పార్టీలోకి రావాలా వద్దా అనేది పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. సోమవారం మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన డీకే అరుణ.. పలు కీలక అంశాలపై స్పందించారు. ఈసారి మహబూబ్ నగర్ లోకల్ వాళ్లకే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని అడుగుతున్నారని చెప్పారు. అన్ని ఎన్నికల్లో పవన్ కుమార్ రెడ్డి పనిచేశారని, కమిట్మెంట్?తో పనిచేస్తారని పవన్ కుమార్ రెడ్డి కోసం టికెట్ అడిగినట్లు చెప్పారు.

మంచి బాధ్యత ఇస్తారేమో?:

బీజేపీ జాతీయ నూతన కమిటీపై స్పందిస్తూ.. ఎవరినైనా ఒక బాధ్యత నుండి తీశారంటే దానికంటే మంచి బాధ్యత ఇస్తారేమో?.. బండి సంజయ్ జనరల్ సెక్రెటరీ గా లేరు.. మంత్రి అయ్యాక పార్టీ బాధ్యత ఉండదు. నేను ఎంపీ అయ్యాక సమయం సరిపోక కర్ణాటక ఇంచార్జిగా వదిలేశానన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలమంతా కలిసే ఉన్నామని చెప్పారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్?కు ఉందని ఎవరిని గద్దె దించి ఎవరిని పెడతారో? ఎవరి గద్దె ఎవరు కూల్చుతారో చూడాలన్నారు. రేవంత్ రెడ్డి అమెరికా టూర్ పై ఆంక్షల విషయంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి అన్ని తెలుసని పాస్ పోర్టుకు కూడా క్లియరెన్స్ ఉండాలన్నారు.

# ఆ రోజే కొత్త పార్టీ ప్రకటన!



న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయంలో కొత్త ప్రకంపనలు సృష్టించారు. గతంలోనే తాను నూతన రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ప్రకటించిన విజయసాయి.. తాజాగా పార్టీని ఎప్పుడు ప్రకటిస్తారో వెల్లడించారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు కొత్త పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు, ప్రజల తరఫున పోరాడేందుకు ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక ప్రతిపక్షంగా వైసీపీ మాత్రమే ఉందన్నారు. విజయసాయిరెడ్డి పార్టీ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది.

అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో పర్యటించిన విజయసాయిరెడ్డి, స్థానిక ఏఈ నూకరాజు అల్లుడు జగదీశ్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యాయత్నం ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన నూకరాజు మనుమడు రియాన్ష్ కార్తికేయ రెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబంలో చోటుచేసుకున్న ఆత్మహత్యలు, జగదీశ్‌రెడ్డి మృతికి దారితీసిన పరిస్థితులు మరియు కారణాలను ఈ సందర్భంగా ఆయన అడిగి తెలుసుకున్నారు.

# ఉద్యోగాలు నిల్.. లిక్కర్ ఫుల్!



న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తూ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. 121 రకాల మద్యం బ్రాండ్స్ కు నోటిఫికేషన్ ఇవ్వడంపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు, మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**మద్యంపైనే శ్రద్ధా?:**

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువత డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, జాబ్స్ కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మద్యం షాపులు పెంచి, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. టైమ్?కు యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు.. మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్ ఇస్తున్నదన్నారు.

**ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన?**

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో మోసం చేశారని, ఇక రాజీవ్ యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయిందని ఎద్దేవా చేశారు. రేవంత్ పగ.. యువత దగ అన్నట్లుగా తయారైందన్నారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన? అని ప్రశ్నించారు.

# స్మార్ట్ మీటర్లపై కవిత ఫైర్!

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమలకు ప్రభుత్వం ప్రజల బ్రెయిన్ వాష్ చేసే కార్యక్రమం చేస్తోందని ఇందులో భాగంగానే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల మాటలు, ఇటీవల నెక్లెస్ రోడ్డులో స్మార్ట్ మీటర్ల ఉపయోగం పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోను రిలీజ్ చేసిన కవిత.. తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పక్షాన కాకుండా పెద్దల పక్షాన ఉందని పదే పదే నిరూపించుకుంటోందని దుయ్యబట్టారు.

సబ్సిడీ ఎత్తేయాలని కుట్ర:

కార్పొరేట్లతో కుమ్మకై విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీ ఎత్తేయాలనే కుట్రకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ముందు మోకరిల్లి వాళ్లు తీసుకొస్తున్న తలా తోక లేని విధానాలను సమర్థిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మీటర్లన్నీ స్మార్ట్ మీటర్లేనని, ప్రస్తుతం రీడింగ్ కోసం పెన్ను పేపర్?తో ఏమీ రాసుకోవడం లేదు కదా అని ప్రశ్నించారు. రైతు నల్ల చట్టాల ద్వారా రైతులకు ఏ స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూసిందో అదే అదానీ కంపనీకి చెందిన స్మార్ట్ మీటర్లను మరో కొత్త పథకం పేరుతో కేంద్రం తీసుకురావాలని చూస్తే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. అదానీలకు కొమ్ము కాస్తూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే యూపీలో ఇలాంటి స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు.

# విజయ్ 'సూపర్ సిక్స్'!

మొదటి పేజీ తరువాయి

జిల్లాల మధ్య, సబర్బన్ (మోఫుసిల్), కొండ ప్రాంతాల్లో తిరిగే సాధారణ ఛార్జీల బస్సులకూ ఇది వర్తిస్తుంది. ఈ పథకానికి ఎలాంటి ఆదాయ పరిమితి గానీ, ప్రయాణాల సంఖ్యపై పరిమితి గానీ ఉండదు. దీనికి ఏటా రూ. 6,000 కోట్ల అదనపు వ్యయం కానుంది.

'అన్నపూర్ణి సూపర్ సిక్స్' – 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉన్న సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు ఏడాదికి 3 ఉచిత ఎల్పీజీ (ప్రా+) సిలిండర్లు అందించనున్నారు. సిలిండర్ల కొనుగోలు మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. 2027 పొంగల్ నుంచి ప్రారంభం కానున్న ఈ పథకానికి ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 4,000 కోట్ల భారం పడనుంది.

పరందూర్ విమానాశ్రయం రద్దు

రైతులు, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరందూర్‌లో ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రజలు నిరాశ్రయులు కాకుండా విమానాశ్రయ నిర్మాణానికి ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత చెన్నై మీనంబాక్కం విమానాశ్రయంలో కొత్తగా 'టెర్మినల్–5'ను నిర్మించనున్నట్లు వెల్లడించారు.

# సర్కార్ నిర్ణయానికి హైకోర్టు సమ్మతి



న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో కీలక ఊరట లభించింది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ యువతులకు అందిస్తున్న అదనపు ఆర్థికసాయాన్ని కొనసాగించుకునేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ యువతులకు 25 శాతం అదనంగా ఆర్థికసాయం అందించేలా గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ఉన్నత న్యాయస్థానం.. దివ్యాంగులకు ఇచ్చే ఆర్థిక సాయం ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై దాఖలైన తదుపరి పిటిషన్ల విచారణను హైకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది.

# ఫీజు బకాయిలపై బీజేపీ సమరం..



న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి 5 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని తెలిపారు. "మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి" అంటూ విద్యార్థులు స్వయంగా సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. 'ఫీజు బకాయి–బీజేపీ లడాయి' పేరుతో బీజేపీ దీక్ష చేపట్టిన సందర్భంగా సోమవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే.. వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. తెలంగాణలో యావత్ విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.. అయినా విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.. కానీ ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ.12 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని.. దీనికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని.. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ తెలిపారు. "యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై లాఠీచార్జ్ చేయించి, పోలీసులతో దురుసుగా వ్యవహరింపజేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వారి నిరసనలో నేను స్వయంగా పాల్గొన్నాను. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి.. ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలి. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు? స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదు? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మా పోరాటం ఆగదు. ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి!" అంటూ వ్యాఖ్యానించారు.

# హోంమంత్రి అనితకు స్వల్ప గాయం



న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): తిరుపతి వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభమైన 'అమరావతి ఛాంపియన్ షిప్' క్రీడా పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేతిపై ఓ డ్రోన్ బ్యాటరీ పడటంతో ఆమెకు గాయమైనట్లు తెలిసింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆ డ్రోన్‌ను సీజ్ చేశారు. ఈ ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఏర్పాటు చేసిన వేదిక పైకి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం తిరిగి కార్యక్రమంలో హోంమంత్రి చురుగ్గా పాల్గొన్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

మరోవైపు, ఈ ప్రతిష్టాత్మక పోటీలు సరికొత్త రికార్డు సృష్టించి 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి అండర్–17, అండర్–23 విభాగాలకు చెందిన 9 వేల మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీలకు తరలివచ్చారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరైన ఈ ప్రారంభోత్సవంలో.. లిమ్కా బుక్ ప్రతినిధి హరీశ్ చేతుల మీదుగా రికార్డు పత్రాన్ని శాప్ చైర్మన్ రవి నాయుడు అందుకున్నారు.

# కృష్ణా జలాలపై తేలని పంచాయితీ..




న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): హైదరాబాద్ జలసౌధలో కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ ఈఎన్సీలూ హాజరయ్యారు. సాగర్, శ్రీశైలం నీటి వినియోగంపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలను వినియోగించాలని ఏపీ కోరింది. పల్నాడు, రాయలసీమ ప్రాంతాలకు తాగునీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ కోరడంతో రెండుసార్లు వాయిదా తర్వాత సోమవారం భేటీ జరిగింది. అయితే కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సెప్టెంబర్ 4న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు.

ఈ మేరకు ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ సంవత్సరం మొత్తం నీటి వినియోగంపై తెలంగాణ ప్రతిపాదన చేసిందని తెలిపారు. అక్టోబర్ వరకు నీటి కేటాయింపులు కోరామని ఆయన చెప్పారు. ఏపీకి 47 టీఎంసీ నీళ్లను అడిగామన్నారు. ఇందుకు తెలంగాణ అభ్యంతరం తెలిపిందన్నారు. పోతిరెడ్డి పాడు నుంచి 22 టీఎంసీలకు తెలంగాణ అంగీకరించిందని ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తి స్పష్టం చేశారు.

తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు నీటి వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. 10 టీఎంసీల నీటిని ఇప్పటికే ఏపీ వినియోగించుకుందని ఆరోపించారు. అంతేకాదు కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసినట్లు రమేశ్ బాబు పేర్కొన్నారు.

# తెలంగాణపై కేంద్రం వివక్ష: సీఎం రేవంత్

న్యూస్ డెస్క్, 24 ఆగస్టు (ఇది కద నిజం): తన విదేశీ పర్యటనపై అన్ని వివరాలు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని ఈ మేరకు అప్లికేషన్ పెట్టుకున్నామని అయినా కూడా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి తిరస్కరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నా పర్యటనకు సంబంధించిన పూర్తి సమాచారం కేంద్రానికి ముందే ఇచ్చామని, విద్య, క్రీడలు, పెట్టుబడుల కోసమే అమెరికా వెళ్తున్నామని చెప్పామని అయినా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో నా అమెరికా పర్యటనకు అనుమతి తిరస్కరించిందని మండిపడ్డారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో టూర్ రద్దు అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యూకే పర్యటన ముగించుకుని ఇవాళ ఉదయం హైదరాబాద్ చేరుకున్న ఆయన తెలంగాణ సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నామని విదేశాంగశాఖ బదులించ్చిందని.. కేంద్రంలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని అన్నారు. బీజేపీ నేతలు విచక్షణ కోల్పోయి అవస్తవాలను ప్రచారం చేశారని సీఎం పర్యటన దాపరికంగా ఉన్నట్లు విదేశాంగశాఖ మాట్లాడిందన్నారు. యూకే, అమెరికాకు ఒకే విధానంతో వెళ్తున్నామని చెప్పాం. అలాంటప్పుడు యూకే పర్యటకు అనుమతి ఇచ్చి అమెరికాకు ఎందుకు నిరాకరించారో ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి నాకెందుకు అభ్యంతరం?

గుజరాత్ సీఎంకు అమెరికా, కెనడా పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్రం తన అమెరికా పర్యనటను ఎందుకు అడ్డుకుందని నిలదీశారు. తెలంగాణకు వచ్చే సరికి విదేశీ పర్యటనలు తిరస్కరిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, స్పోర్ట్స్ రంగంలో పెట్టుబడులతో ముందుకు వెళ్లాలన్నది మా ఆలోచనతో ముందుకు వెళ్తుంటే తనను అడ్డుకోవడం అంటే ఇది వ్యక్తిగతంగా రేవంత్ రెడ్డిని అడ్డుకోవడం కాదని నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజలన అడ్డుకోవడం అని తెలంగాణ ప్రజలను అవమానించడం అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఈ తిరస్కరణకు గుజరాతీ ఆధిపత్యమేనని, నరేంద్ర మోడీ ఇప్పటికీ గుజరాత్ సీఎంగా వ్యవహరిస్తున్నారే తప్పా భారత ప్రధానిగా ఆలోచించడం లేదన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిని అమెరికా పర్యటనకు ఎనిమిది రోజుల పాటు అనుమతి ఇచ్చి తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం రాజకీయ కారణాలతో అనుమతి తిరస్కరించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనన్నారు.

కుట్రతోనే అడ్డుకున్నారు..

ముఖ్యమంత్రి హోదాలో తన పర్యటనను అడ్డుకోవడం చూస్తుంటే తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షను ప్రదర్శిస్తోందని అర్థం అవుతోందని ఈ వివక్షను ఏమాత్రం సహించరానిదన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్టు చేస్తున్నారా? తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఇది అంతా ఆషామాషీగా తీసుకునే విషయం కాదని రాష్ట్ర బీజేపీ నేతల మెతక వైఖరి వల్ల తెలంగాణ వ్యతిరేక భావజాలం పార్లమెంట్‌లో పదే పదే మాట్లాడుతున్నారు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే గుజరాత్?కు పెట్టుబడులు ఆగిపోతాయనే కుట్రతో తన పర్యటనను అడ్డుకున్నారని మండిపడ్డారు. రాజకీయ కారణాలతో అడ్డుకుంటున్నామని చెబుతున్నారు. మోడీది బీజేపీ నాది కాంగ్రెస్, ఆయనది గుజరాత్ నాది తెలంగాణ ఇందులో తెలియని రాజకీయ ఎజెండా ఏంటని ప్రశ్నించారు.

# భయపడొద్దు.. న్యాయం చేస్తాం!

మొదటి పేజీ తరువాయి




22ఏ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఈనెల 18వ తేదీ నుంచి ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చినట్లు పొంగులేటి తెలిపారు. ఇందులో రిపీట్ కాల్స్‌ను తొలగిస్తే 980 ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు.

వాటిలో 547 వ్యవసాయ సంబంధిత సమస్యలు కాగా.. 433 వ్యవసాయేతర అంశాలకు సంబంధించిన కాల్స్ ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను జిల్లాల వారీగా అధికారులకు పంపించి పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. 22ఏ అంశంపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను భయపెడుతున్నాయని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. గతంలో రిలాక్సేషన్ వచ్చిన నిజమైన కేసుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయలేని వాటిని మాత్రం చేయలేమని స్పష్టం చేశారు.

కొంతమంది దొంగ జీవోలు, నకిలీ మెమోలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని మంత్రి పొంగులేటి ఆరోపించారు. అలాంటి వ్యవహారాలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నకిలీ పత్రాలతో వివాదాస్పద భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు.

1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన్ భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చే అవకాశం ఉంది. అయితే భూముల జాబితా నవీకరణ సమయంలో కొన్ని చోట్ల ఒకే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేట్ పట్టా భూములు ఉన్నప్పటికీ మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడంతో సమస్య తలెత్తినట్లు ప్రభుత్వం చెబుతోంది.

దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో పలువురు ఆస్తి యజమానులు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలతో పాటు గతంలో అనుమతులతో అభివృద్ధి చేసిన కాలనీలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన ఆస్తులు కూడా కొన్ని సందర్భాల్లో నిషేధిత జాబితాలో కనిపించడంతో ప్రస్తుతం తీవ్ర గందరగోళం నెలకొంది.

22ఏ భూముల సమస్యలపై ప్రతి సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజలకు సంబంధించిన నిజమైన సమస్యలను వేగంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి న్యాయం చేస్తామని.. అర్హత ఉన్న ప్లాట్ బుకింగ్ కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ విధానంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

# కేంద్రం ముందు రేవంత్ సర్కార్ మోకరిల్లింది

- ప్రీపెయిడ్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్ల ఏర్పాటు నిర్ణయం ఉపసంహరించుకోవాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత




ఇది కద నిజం,హైదరాబాద్ : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ముందు రేవంత్ రెడ్డి సర్కారు మోకరిల్లిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ ను ఎత్తివేసే కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. సోమవారం ఈమేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. అనంతరం పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఏర్పాటు చేసిన పవర్ ఎక్స్ పో -- 2026ను సందర్శించి అక్కడ ప్రదర్శనకు ఉంచిన స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్ ను దూరం చేయడంతో పాటు లాండ్రీ షాపులు, సెలూన్లకు ఉచిత కరెంట్ ఎత్తివేసే కుట్రలో భాగంగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పథకంలో భాగంగానే రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నం రేవంత్ సర్కారు చేసిందన్నారు. అదానీకి లాభం చేయడానికి కేంద్రం స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెడుతుంటే రేవంత్ సర్కారు దానికి వంత పాడుతోందన్నారు. దీనిపై ప్రజల మైండ్ వాష్ చేసేందుకే పీపుల్స్ ప్లాజాలో ప్రదర్శన ఏర్పాటు చేసిందన్నారు.

ఈఆర్సీ వద్ద రైతులు గొడవ చేస్తే వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని చెప్పారని.. గృహ విద్యుత్ కనెక్షన్లకు మాత్రం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల ట్రాన్స్ కో సీఎండీ చెప్పారని గుర్తు చేశారు. సెల్ ఫోన్ ముందస్తుగా రీచార్జ్ చేసుకున్నట్టుగా ఇకపై కరెంట్ కు ముందస్తు చార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి స్మార్ట్ మీటర్లతో వస్తుందన్నారు. రీచార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు ఆటోమేటిక్ గా ఇండ్లలో కరెంట్ కట్ అవుతుందని చెప్పారు. యూపీలో స్మార్ట్ ఎలక్ట్రిసిటీ మీటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలు ఆగ్రహంతో వాటిని తొలగించి కరెంట్ ఆఫీసుల్లో పడేసి వెళ్తున్నారని అన్నారు. ఇప్పుడున్న మీటర్లతోనే కరెంట్ సరఫరా చేయాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ లు, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగుండేలా చర్యలు చేపట్టాలని కోరారు. మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టే ప్రయత్నాలను ఇకనైనా విరమించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తెలంగాణ రక్షణ సేన వ్యతిరేకిస్తుందని.. ప్రజల కోసం ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఉద్యమిస్తుందని హెచ్చరించారు.

**అవినీతి అధికారులు సరే.. అవినీతికి మూలకారకుల సంగతేంది?**

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి రూ.వేల కోట్లు కొల్లగొట్టిన అధికారుల గుట్టును ఏసీబీని ఉపయోగించి బయట పెడుతున్న ప్రభుత్వం ఆ అవినీతికి మూల కారకుల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈమేరకు ఎక్స్ (ట్విట్టర్)లో సోమవారం పోస్ట్ పెట్టారు. గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు వందలు, వేల కోట్ల ప్రజాధనం దోచుకోవడానికి వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న వారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. అధికారులను ముందు పెట్టి రూ.వేల కోట్లు దోచుకుంటున్న వారి నుంచి ఆ అవినీతిని సొమ్ము కక్కించే వాళ్లు ఎవరు అని నిలదీశారు. అవినీతికి అధికారులను బాధ్యులను చేస్తున్నారని.. వారిని అడ్డుపెట్టుకొని వ్యవస్థలను దోపిడీ చేసే వారిని కట్టడి చేయాల్సిన వాళ్లెవరని ప్రశ్నించారు. తమకు మంచి చేస్తారని నమ్మి ప్రజలు అధికారం ఇస్తే భవిష్యత్ తరాలకు చెందాల్సిన సంపదను కొల్లగొడుతున్న వారిని చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు. తన ప్రశ్నలపై పౌర సమాజం సీరియస్ గా చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

## మలుపు ముప్పుకు ఎస్సై రాజారెడ్డి చెక్

**- పోలీసుల చొరవతో పొదలు తొలగింపు**




ఇది కద నిజం, కుక్కునూరు: మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని ఎస్-టర్నింగ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు కుక్కునూరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రహదారి పక్కన పెరిగిన పొదలు, చెట్ల కొమ్మలు వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో పాటు, మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సోమవారం కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి నేతృత్వంలోని పోలీసుల బృందం జేసీబీ సహాయంతో రహదారి పక్కన ఉన్న పొదలు, చెట్ల కొమ్మలు, ఇతర అడ్డంకులను తొలగించారు. దీంతో మలుపు వద్ద అంతా క్లియర్ కావడంతో వాహనదారులకు ఉపశమనం కలిగినట్లైంది. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ, వాహనదారులకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు కుక్కునూరు పోలీసులు చేసిన ముందస్తు చర్యలపై అంతటా ప్రశంసల వర్షం కురుస్తోంది.

## ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**-- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



ఇది కద నిజం, కుక్కునూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, పేదలకు సామాజిక న్యాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కుక్కునూరు తహసీల్దార్ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా "మార్పు రావాలి.. మార్పు కావాలి" అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కుక్కునూరు మండల కార్యదర్శి కూరాకుల బాబురావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పేదల వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, పేదలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కల్పించాలని కోరారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో పేదలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, భీమయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీఆర్టీ జాతీయస్థాయి శిక్షణకు పిట్లం ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక ఎంపిక





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సీసీఆర్టీ నిర్వహించిన జాతీయస్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి పిట్లం మండలం చౌటకట్టు తాండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక ఎంపికయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆగస్టు 12 నుంచి 21 వరకు నిర్వహించిన పది రోజుల శిక్షణలో దేశవ్యాప్తంగా 115 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, జానపద కళలు, సంగీతం, నృత్యం, చిత్రకళ, బొమ్మలాట, వారసత్వ కట్టడాలు, హస్తకళలు, స్థానిక సంప్రదాయాలు, విలువల విద్య తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇటువంటి శిక్షణల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతిపై అవగాహన, దేశభక్తి, సాంస్కృతిక విలువలు పెంపొందుతాయని మండల విద్యాధికారి దేవిసింగ్ తెలిపారు. ప్రియాంక ఎంపిక పిట్లం మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## మాటా ఇచ్చారు..నెరవేర్చారు

**ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం**



ఇది కద నిజం: నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పాటిల్ తన చేతుల మీదుగా ప్రారంభించారు.గత సంవత్సరం మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇన్ వన్ పుస్తకాల, పంపిణీ కార్యక్రమంలో భాగంగా కేజీబీవీలో చదువుకొనే బాలికలకు తమకు మంచి తాగునీటి సదుపాయం కల్పిస్తూ ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఈ రోజు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితి వచ్చినపుడు నా నియోజక వర్గ ప్రజల కోసం మోహన్ రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ ఎల్ల వేళల అండగా ఉంటుంది అని కోరడం పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తైదర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసిబి దాడులు



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి : ఆలేరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం రోజున ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఆలేరు మండలం కొలనుపాక రెవెన్యూ పరిధిలో గల భూమి ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన బుడిగ మహేష్ కు తన తండ్రి ద్వారా సంక్రమించిన భూమిని తండ్రి మరణానంతరం పౌతి చేయడానికి జిపిఓ అహ్మద్, ఆర్ ఐ పూర్ణచంద్రరావు లు పౌతి చేయడానికి గాను 20వేల రూపాయల లంచం డిమాండ్ చేయగా బుడిగ మహేష్ అంత ఇచ్చుకోలేను అని చెప్పడంతో జిపిఓ అహ్మద్, పూర్ణచందర్ లు 14000 రూపాయలు ఖచ్చితంగా ఇవ్వవలసిందేనని చెప్పడంతో బుడిగ మహేష్ ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం రోజు కంప్లైంట్ ఇవ్వగా రెండు రోజులు నిఘా వేసి పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు జీపీఓ, ఆర్ ఐ లను అదుపులోకు తీసుకుని విచారిస్తునట్లు బాధితుడు తెలిపాడు.

## రూ. 50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ ఏసీబీ కి చిక్కిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు



ఇది కద నిజం: నిర్మల్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు, దాడులు నిర్వహించారు. ఒక వ్యాపారికి పన్ను తగ్గించేందుకు గాను రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.సదరు వ్యాపారికి పన్ను తగ్గించేందుకు గాను గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి.వ్యాపారి ఫిర్యాదు.లంచం ఇవ్వడానికి ఇష్టపడని వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది.పక్కా ప్రణాళికతో దాడులు జరిపిన ఏసీబీ అధికారులు, బాధితుడి నుంచి రూ. 50,000 లంచం స్వీకరిస్తున్న సమయంలో గోదావరి, సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణలను రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

## శ్రావణ సోమవారం సందర్భంగా శివాలయాల్లో ఎమ్మెల్యే పూజలు



ఇది కద నిజం:శ్రావణ సోమవారం సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పలు శివాలయాల్లో పూజలు నిర్వహించారు. భైంసా మండలంలోని సుంక్లి గ్రామ నాగదేవత ఆలయంలో పూజలు చేశారు. అదేవిధంగా సూర్యాపూర్ గ్రామ స్వాగత తోరణాన్ని ప్రారంభించి, శివాలయంలో పూజలు చేశారు. అనంతరం ఓలా గ్రామంలో శివాలయంలో ప్రత్యేక పూజలుచేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ పరమేశ్వరున్ని కోరుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికి శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమం లో సర్పంచ్ సీరం సుష్మారెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు

## బురద మయం కాలనీ.. ఇంట్లోకి వెళ్లలేని పరిస్థితి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామంలోని మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కాలనీ పూర్తిగా బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇటుకబట్టి పరిశ్రమకు అవసరమైన మట్టి తదితర సామగ్రిని కాలనీ, జనావాసాల మధ్య నుంచి తరలిస్తుండటంతో రహదారులు దెబ్బతిని బురద,తో అవస్తలు ఇళ్లలో దుమ్ముతో నిండిపోయాయని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో ఇళ్లలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటుకబట్టి పరిశ్రమ యాజమాన్యం అవసరమైన సామాగ్రి తరలింపునకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసి, కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## అర్హులైన వారందరికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

**ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



ఇది కద నిజం:అర్హులైన వారందరికీ దశల వారిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పవార్ రామరావ్ తెలియజేశారు. కుంటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో 73 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 10 సంవత్సరాల పాటు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాక ఇబ్బందులు పడ్డారని, ముధోల్ నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రస్తుతం రెండో విడతలో మరో 2500 ఇండ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గ్రామాల్లో రేకుల షెడ్లు,గుడిసెలో ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ప్రస్తుతం వారికి ఇండ్లు మంజూరు అవుతాయని చెప్పారు. ఎల్ టూ లిస్టులో ఉన్నవారిని ఎల్ వన్ లోకి మార్చుకోవచ్చని పంచాయతీ కార్యదర్శికి తమ వివరాలు అందజేయాలని చెప్పారు. ప్రతి పేద వాడు ఇల్లు నిర్మించుకునేలా తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఇందిరమ్మ ఇండ్లు మంజులవుతున్నాయన్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : పిట్లం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో సాయన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్వో మహేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అధికారులకు అందజేయగా, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# ఆగస్టు 29న అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం, బి.కొత్తకోట లో జాబ్ మేళా


## పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

ఇది కద నిజం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 29న బి.కొత్తకోటలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐఏఎస్ పీజీఆర్ఎస్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి (ఏపీఎస్ఎస్‌డీసీ) తదితరులు పాల్గొన్నారు. జాబ్ మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్ (ఎన్ఐఐటీ), వాల్ట్‌స్ఫియర్ ఏఐ టెక్నాలజీస్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్, ఇంటర్న్‌షాలా ఇన్నోవేషన్, అమర రాజా, ఎస్ఎస్‌కేజీ బిజినెస్ సర్వీసెస్, యంగ్ ఇండియా, ముత్తూట్ ఫైనాన్స్, టీటీజీ హెచ్ఆర్, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, శబరి మ్యాన్‌పవర్ తదితర 12 సంస్థలు పాల్గొననున్నాయి. వివిధ సంస్థల్లో రిలేషన్‌షిప్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, అసెంబ్లింగ్ ఆపరేటర్, క్వాలిటీ, బ్రాంచ్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, మెషిన్ ఆపరేటర్, డేటా ఎంట్రీ, ప్రొడక్షన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇన్సూరెన్స్ అడ్వైజర్, టెలీకాలర్, ఫార్మసీ ట్రైనీ, ఫార్మసిస్ట్, ప్రొడక్షన్ ట్రైనీ, సర్వీస్ ట్రైనీ తదితర ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.




ఈ జాబ్ మేళాలో సుమారు 700 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, బీఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఉద్యోగ ప్రదేశాలు అన్నమయ్య జిల్లా, పుంగనూరు, మదనపల్లె, గుర్రంకొండ, చిత్తూరు, బెంగళూరు, హోసూరు, తెలంగాణ తదితర ప్రాంతాల్లో ఉంటాయి. ఉద్యోగం, విద్యార్హతలను బట్టి నెలకు రూ.12,000 నుంచి రూ.35,000 వరకు, కొన్ని ఉద్యోగాల్లో సంవత్సరానికి రూ.3.12 లక్షల వరకు వేతనం లభించనుంది. వయోపరిమితి సంస్థ, ఉద్యోగాన్ని బట్టి 18 నుంచి 50 సంవత్సరాల వరకు ఉంటుంది. అర్హత కలిగిన యువతీ యువకులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, బయోడేటా/రెజ్యూమ్‌తో పాటు అవసరమైన ఇతర పత్రాలను తీసుకొని ఆగస్టు 29న బి.కొత్తకోట ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కోరారు.

# గోవిందప్ప కుమార్తె వివాహానికి హాజరైన బహుజనసేన రాష్ట్ర అధినేత చందు



ఇది కద నిజం,చిత్రకూటం: బహుజనసేన రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప కుమార్తె వివాహ మహోత్సవం శనివారం (22-08-2026) ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు చందు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్తూరు మరియు అన్నమయ్య జిల్లాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులతో కలిసి వేడుకకు విచ్చేసిన ఆయన, నూతన వధూవరులను కలసి పట్టువస్త్రాలు, శుభాకాంక్షలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ, గోవిందప్ప కుటుంబానికి తమ బహుజనసేన కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, అన్నమయ్య జిల్లాల బహుజనసేన నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొని నూతన దంపతులకు నూరేళ్ల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

# కలకలం రేపుతున్న నూకరాజు కుటుంబ విషాదం

## --- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు

రావులపాలెం (ఇది కద నిజం) ఆగస్టు 24: పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

'లవ్ జిహాద్' పేరుతో జరుగుతున్నట్లు తాను పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం, పోలీసులు లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఏఈ నూకరాజు కుటుంబ విషాదానికి సాదిక్ ఖాన్ వేధింపులే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. సాదిక్ ఖాన్‌తో పాటు మరో తొమ్మిది మంది కలిసి కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో సుమారు 15 కుటుంబాలను వేధించినట్లు తనకు సమాచారం ఉందని తెలిపారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడి, అనంతరం వారి ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకున్నారన్న ఆరోపణలను కూడా ఆయన ప్రస్తావించారు.

రావులపాలెంలో నూకరాజుకు సంబంధించిన సుమారు రూ.40 కోట్ల విలువైన ఆస్తిని సాదిక్ ఖాన్ రాయించుకున్నాడని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణలన్నింటినీ దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

కుటుంబాన్ని కోల్పోయిన బాలుడికి అండగా మాజీ ఎంపీ

ఈ విషాద ఘటనలో నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యులంతా గోదావరిలోకి దూకిన సమయంలో ఈత రావడంతో నూకరాజు మనవడు రియాన్ష్ కార్తికేయరెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను, తాతయ్యను కోల్పోయిన రియాన్ష్ పరిస్థితి తీవ్ర విషాదకరంగా మారింది.

ఈ నేపథ్యంలో కుటుంబాన్ని కోల్పోయిన పదేళ్ల రియాన్ష్ కార్తికేయరెడ్డికి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అండగా నిలిచారు. రాజమండ్రికి చేరుకున్న ఆయన రావులపాలెంలో ఉన్న బాలుడిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు భరోసా కల్పించనున్నట్లు తెలిపారు.

సాదిక్ ఖాన్ అరెస్టు --- దర్యాప్తుపై ఆసక్తి

ఈ ఘటనకు సంబంధించి పరారీలో ఉన్న షేక్ సాదిక్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి కాకినాడకు తీసుకొచ్చారు. నూకరాజు కుమార్తె సౌజన్యను సాదిక్ ఖాన్ తీవ్రంగా వేధించాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఈ విషాద నిర్ణయం తీసుకుందని ఆరోపణలు ఉన్నాయి.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ప్రతి అంశాన్ని పోలీసులు సాక్ష్యాధారాలతో నిర్ధారించాల్సి ఉంది. ఆస్తుల



బదలాయింపులు, ఆర్థిక లావాదేవీలు, ఫోన్ సంభాషణలు, సందేశాలు, బెదిరింపులు, సంబంధిత వ్యక్తుల పాత్ర, గతంలో నమోదైన ఫిర్యాదులు తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిగితేనే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ముఖ్యంగా ఒక కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసిన ఈ ఘటనలో బాలుడు రియాన్ష్ భవిష్యత్తు, అతని సంరక్షణ, కుటుంబ ఆస్తుల రక్షణ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సిన అంశాలే అయినప్పటికీ, నూకరాజు కుటుంబ విషాదం వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది.

# హర్షవర్ధన్ తేజ మృతికి బాధ్యులెవరు

## : నారా లోకేష్ సమాధానం చెప్పాలి!




ఇది కద నిజం: శెట్టూరు మండల కేంద్రంలో హాస్టల్ సమీపంలోని శిథిలావస్థలో ఉన్న గోడ కూలి ఎనిమిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ తేజ మృతి చెందడం అత్యంత విషాదకరం. మరో విద్యార్థి అక్షయ గాయపడటం ప్రభుత్వ విద్యార్థి భద్రతా చర్యలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హాస్టల్ పరిసరాల్లో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాన్ని తొలగించకుండా, విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడం ఎవరి నిర్లక్ష్యం? హాస్టల్ వార్డెన్, డే వాచ్‌మెన్ విధుల్లో ఉన్నారా? ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న మంత్రి నారా లోకేష్ గారు హర్షవర్ధన్ తేజ కుటుంబానికి సమాధానం చెప్పాలి. మృత విద్యార్థి హర్షవర్ధన్ తేజ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే ప్రకటించాలి. గాయపడిన విద్యార్థి అక్షయకు పూర్తి స్థాయి ఉచిత వైద్యం అందించడంతో పాటు, అతని కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలి. ఈ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి నిర్లక్ష్యానికి కారణమైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో శిథిల భవనాలు, ప్రమాదకర నిర్మాణాలను వెంటనే గుర్తించి తొలగించి, విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. విద్యార్థుల ప్రాణాలకు విలువ ఇవ్వాలి. హర్షవర్ధన్ తేజ మృతికి న్యాయం జరిగే వరకు USFI పోరాటం కొనసాగిస్తుంది.

దీ. నరసింహా రెడ్డి USFI రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్

# భవన నిర్మాణ సామగ్రి చోరీ ముఠా గుట్టురట్టు

## : ఐదుగురి అరెస్ట్.. రూ.లక్ష నగదు, ఆటో, బైక్ స్వాధీనం



ఇది కద నిజం, చందానగర్, ఆగస్టు 24:

భవన నిర్మాణ ప్రాంతాల్లో ఖరీదైన సామగ్రిని లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును విక్రయించగా వచ్చిన రూ.1,00,000 నగదుతో పాటు నేరానికి ఉపయోగించిన ఒక ట్రాలీ ఆటో, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నల్లగండ్ల సమీపంలోని 'వర్టెక్స్ వేగా డెవలపర్స్' నిర్మాణ ప్రాంతంలో మైవాన్ అల్యూమినియం బోర్డులు చోరీకి గురైన ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19, 20 తేదీల మధ్య అర్ధరాత్రి వేళ నల్లగండ్ల లోని వర్టెక్స్ వేగా ప్రాజెక్టు కాంపౌండ్ వాల్ షీట్లను పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు, అక్కడ భద్రపరిచిన మైవాన్ అల్యూమినియం కన్స్ట్రక్షన్ బోర్డులు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు (క్రైమ్ నంబర్ 908/2026) నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు తీవ్రంగా గాలించి సోమవారం (ఆగస్టు 24) ఐదుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు.

అరెస్ట్ అయిన వారిలో కొండాపూర్ వడ్డెర బస్తీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆనంద్ (21), ఆటో డ్రైవర్లు అనిల్ (26), బాలాజీ (19), రాఘవేంద్ర కాలనీకి చెందిన డ్రైవర్ సుభాష్ (23), ప్రేమ్‌నగర్‌కు చెందిన కార్మికుడు యోగేష్ దండగులే (20) ఉన్నారు. వీరంతా ఓ ముఠాగా ఏర్పడి నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు ఆనంద్ పై గతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదై ఉందని పోలీసులు వెల్లడించారు.

పోలీసుల విచారణలో నిందితులు తాము చేసిన నేరాలను అంగీకరించడమే కాకుండా, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరో కేసు, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు కేసుల్లో కూడా తమ పాత్ర ఉన్నట్లు ఒప్పుకున్నారు. నిందితుల సమాచారం మేరకు చోరీ సొత్తును కొనుగోలు చేసిన చందానగర్ రైల్వే స్టేషన్ రోడ్డులోని స్క్రాప్ వ్యాపారి బాదరాని రత్నాకర్ (34)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. రత్నాకర్ నుంచి రూ. 1,00,000 నగదుతో పాటు దొంగతనానికి ఉపయోగించిన ట్రాలీ ఆటో (TG07V6429), హెచ్ఎఫ్ డిలక్స్ బైక్ (TS07JG5636)లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో పరారీలో ఉన్న మరో నలుగురు నిందితులు రాజు, విజయ్, చరణప్పలతో పాటు స్క్రాప్ కొనుగోలు చేసిన ప్రధాన వ్యాపారి రాజు కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. కాగా, అరెస్ట్ చేసిన ఐదుగురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. భవన నిర్మాణ సంస్థల యజమానులు, సైట్ పర్యవేక్షకులు నిర్మాణ ప్రాంతాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా చర్యలు పటిష్టం చేసుకోవాలని చందానగర్ పోలీసులు సూచించారు.

ఆర్సీపురం డివిజన్ ఏసీపీ ప్రదీప్ కుమార్ పర్యవేక్షణలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్ కుమార్, క్రైమ్ స్టాఫ్ బృందం చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించడంతో వారిని ఉన్నతాధికారులు అభినందించి, రివార్డులను ప్రకటించారు.

# నవాబుపేటలో ఇంటింటికి తెలుగుదేశంపార్టీ కరపత్రాలు పంపిణీ



నెల్లూరు జిల్లా రాపూరు(ఇది కద నిజం): -నెల్లూరు జిల్లా రాపూరు మండలం రాపూరు పంచాయతీ పరిధిలోని నవాబుపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాలతో, రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చె న్ను అశోక్ రెడ్డి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పచ్చి గల రత్నయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య మాదిగ, సమయం ప్రసాద్, అడసనపల్లి వేమయ్య, బూత్ కన్వీనర్ వెంకయ్య, నాగార్జున, నరసయ్య, జయమ్మ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాయకులు పాల్గొన్నారు.

# మా "భూమి" మాకు ఇప్పించండి మేడం.!

## జమ్మలమడుగు ఆర్డీవోకు మొరపెట్టుకున్న బాధితురాలు కాకి జ్యోతి.



ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 24: వైఎస్ఆర్, కడపజిల్లా.. దువ్వూరు మండలం, జిల్లెల్ల గ్రామానికి చెందిన మల్లుగాల ఓబులమ్మ అలియాస్ గున్నగాల ఓబులమ్మ వయసు 83 సంవత్సరాలు చిన్న కూతురు కాకి జ్యోతి మాట్లాడుతూ.. మా అమ్మ కు ఐదుగురు ఆడపిల్లలు సంతానం అయితే స్వర్ణలత మా అమ్మ ఓబుళమ్మను మోసం చేసి దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామం సర్వేనెంబర్ 479/4 విస్తీరము 1.13 ఎకరాల సీలింగ్ పట్టా భూమిని కర్నూలు టౌన్ కు చెందిన హరిజన స్వర్ణలత భర్త ఖాసిం అనే మహిళ వృద్ధురాలైన ముల్లుగల ఓబులమ్మను మోసం చేసి ఐదుగురి కూతుర్లకు తెలియకుండా దువ్వూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఫ్యామిలీ సభ్యుల ధ్రువీకరణ పత్రం మరియు మా నాన్న మల్లేష్ మరణ ధ్రువీకరణ పత్రం లేకుండా రిజిస్టర్ చేసుకుని మమ్మల్ని ఇబ్బంది ఇబ్బందులకు గురిచేస్తుంది. కనుక స్వర్ణలత నుండి మా భూమి మాకు ఇప్పించాలని ఆర్డీవో శిరీష కు వినతిపత్రం అందించారు. ఈ భూమిని సుమారు 50 సంవత్సరాల నుండి మేము అనుభవిస్తూ సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, మాకు న్యాయం చేయాలని, దువ్వూరు తాసిల్దార్, జిల్లా కలెక్టర్ కి పలుమార్లు అర్జీలు ఇచ్చిన మాకు న్యాయం జరగలేదని, దయచేసి మాభూమి మాకు ఇప్పించాలని, ఆర్డిఓ శిరీషను వేడుకున్నారు..

# ఏటూరునాగారం మండల కాంగ్రెస్‌కు నూతన కార్యాలయం






ఇది కద నిజం, ఏటూరునాగారం :

ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయకుమార్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీకి నూతన కార్యాలయం సిద్ధమైంది. పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమావేశాలు నిర్వహించేందుకు, పార్టీ కార్యక్రమాలపై చర్చించేందుకు ఈ కార్యాలయం ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నూతన కార్యాలయం కేంద్రంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచి, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. త్వరలో నూతన కార్యాలయ ప్రారంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వెల్లడించారు. ఈ కార్యాలయం ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీకి నూతన ఉత్సాహాన్ని అందించి, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలకు మరింత ఊపునిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.